క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్భాగ్యులకు ఆశ్రయం



ఆర్‌పీఎఫ్, ఏయూటీడీ సిబ్బంది రెస్క్యూ చేసిన వ్యక్తులు

అల్లిపురం: ఎప్పటి నుంచో రైల్వే స్టేషన్‌లో తిరుగాడుతున్న ఏడుగురు మానసిక రోగులను రైల్వే పోలీసులు, ఏయూటీడీ సిబ్బంది కలిసి అతికష్టం మీద గురువారం జీవీఎంసీ టీఎస్ఆర్ షెల్టర్‌కు తరలించారు. వీరిలో రాహుల్ (20) బీహార్, శ్రీను (34) బరంపురం, శ్రద్ధ మండల్ (60) అరకు దగ్గర పడిగట్టి గ్రామం, గుడిరెడ్డి (70) నెల్లూరు దగ్గర ఉదయగిరి, ప్రవీణ్ సింగ్ రావత్ (34) రాజస్థాన్, పి. నరసింహారావు (75) గుంటూరు గుర్తు తెలియని ఏమీ మాట్లాడటలేని సుమారు 45 ఏళ్ల వ్యక్తి ఉన్నారు. వీరిని సైకియాట్రిస్ట్ శ్రావణి పరీక్షించి షెల్టర్‌లోనే వైద్య సదుపాయం అందించనున్నట్లు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఈ రెస్క్యూలో షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మ, కేర్‌టేకర్లు లీల, జయలక్ష్మి, ఉమ, ప్రభాకరరావు పాల్గొన్నారు.

రేణుక యల్లమ్మ ఆలయంలో అన్నసమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారికి గురువారం ఆలయ అర్చకుడు కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. అన్నదానంలో సుమారు వెయ్యి మంది పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు, సలహా సంఘం సభ్యుడు బొడ్డేటి ప్రసాద్, కమిటీ సభ్యులు గణేష్, సత్యనారాయణ, మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నీలమ్మ వారం



నీలమ్మ వారి తిరువీధి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: భక్తుల కొంగు బంగారం రాచపోల మాంబ అమ్మవారి పండగలో భాగంగా గురువారం నీలమ్మవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మరివీధిలో అమ్మవారి పుట్టింటి నుంచి వేపకొమ్మలు, పసుపు నీళ్లతో నింపిన కడవలను తిరువీధిగా అల్లిపురం మెయిన్‌రోడ్డు, కుమ్మరివీధి, బంగారుమెట్ట, వెంకటేశ్వరమెట్ట, నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం వరకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో ప్రతి ఇంటికి మంత్రించిన నీటిని జల్లుతూ వర్షాకాలంలో వచ్చే అంటు రోగాలు, సీజనల్ వ్యాధుల నుంచి అల్లిపురం ప్రజలకు రక్షణ కల్పించాలని నీలమ్మ వేపచెట్టు అమ్మవారికి అభిషేకం చేశారు. ఉత్సవాల ముగింపులో భాగంగా ఆదివారం అమ్మవారి సతకం పట్టు వద్ద మహా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి..



ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకం అమలు చేయాలి. 21, 31 జీవోలు రద్దు చేయాలి. లేదంటే ఆటోవాలాలు బతకలేరు. ఇప్పటికే జరిమానాలు కట్టలేక, ఆటో ఫైనాన్స్‌లు చెల్లించలేక సతమతమవుతున్నాం.

– పెద మూర్తి, ఆటోడ్రైవర్, స్ప్రింగ్‌రోడ్డు



వాహనమిత్ర ఊసే లేదు

- మోసపూరిత హామీతో ఆటోవాలాలను వంచించిన కూటమి ప్రభుత్వం
- ఏడాదైనా అమలు చేయని వైనం
- పథకం అమలు కోసం ఎదురు చూస్తున్న నాలుగున్నర వేల పైచిలుకు ఆటోవాలాలు
- జగనన్న ప్రభుత్వ హయాంలో అయిదేళ్లలో రూ. 7,69,20,000 పంపిణీ

జగదాంబ: జగనన్న ప్రభుత్వ హయాంలో ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ. 10 వేలు వాహన మిత్ర పథకం కింద సాయం అందించేవారు. పేరుకే నవరత్నాలు కాని వంద కంటే ఎక్కువ రత్నాల్లాంటి పథకాలు పేదలకు అందించి సంక్షేమం అంటే ఇదీ అని చాటి చెప్పారు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. అలా ఆయన పేదలకు పెన్నిధిగా నిలిస్తే.. నేడు చంద్రబాబు ఆ పథకాలను అటకెక్కించేశారు. ఎన్నికల ప్రచారంలో బ్యాడ్జీ కలిగి ఉంటే చాలు రూ. 15 వేలు ఆటో డ్రైవర్లకు ఇస్తామని ఆనాడు ఇచ్చిన హామీ గురించి ఇప్పుడు మాట్లాడకపోవడంతో నియోజకవర్గంలోని నాలుగున్నర వేల పైచిలుకు ఆటోవాలాలు కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

హామీలు గుప్పించి.. అమలు మరిచారు..

ఎన్నికలకు ముందు కూటమి నాయకులు కేవలం ఓటు బ్యాంక్ కోసం ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ. 15 వేలు ఇవ్వడంతో పాటు జరిమానాలకు కారణం అవుతున్న జీవో 21, 31 రద్దు చేస్తామని నమ్మి బలికారు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు, టాటా మ్యాజిక్, కారు, జీపు వంటి వాహనాలకు గ్రీన్‌కార్డు, లేబర్ ట్యాక్స్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, టోల్ ఫీజులు తగ్గిస్తామని చెప్పారు. చంద్రన్న బీమా పేరుతో సహజ మరణానికి రూ. 5 లక్షలు, ప్రమాదం జరిగి మరణిస్తే రూ. 10 లక్షలు ఇస్తామని తియ్యగా చెప్పారు. నేడు ఆ మాటలు ఏమయ్యాయని ఆటో డ్రైవర్లు ప్రశ్నిస్తున్నారు. నాడు లోకేష్ పాదయాత్రలో పేదలే ఆయనతో కలిసి నడిచారు. కానీ అధికారం చేతికి వచ్చాక కార్పొరేట్ కంపెనీలు, పెద్దపెద్ద వ్యాపారవేత్తలే ఆయనకు కనిపిస్తున్నారని.. నాడు పేదలకు ఇచ్చిన హామీలు ఆయన మరిచిపోయారని ఆటోవాలాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ఏడాదితో కలిపి ఇవ్వాలి..



తల్లికి వందనం వేశారు. ఇప్పుడు వాహన మిత్ర కూడా వేయాలి. గత ఏడాదితో కలిపి ఆ సొమ్ము ఇవ్వాలి. పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. లేదంటే బతకలేం. ప్రభుత్వం మా గురించి కూడా ఆలోచించాలని కోరుతున్నాం.

– గురువులు, ఆటోడ్రైవర్, దుర్గాలమ్మ గుడి జంక్షన్

జరిమానాలు కట్టలేకపోతున్నాం..



ఆటో, ట్యాక్సీ నడుపుతూ వచ్చిన డబ్బులతో బతుకుతున్నాం. వాహనమిత్ర వంటి పథకం అమలైతే మాకు వెసులుబాటుగా ఉంటుంది. ఇంటి పోషణ, పిల్లల చదువులు సాగుతాయి. ఆటోవాలాలను ఇబ్బంది పెట్టే జీవోలను రద్దు చేయకపోతే జరిమానాలు కట్టలేక కుదేలవుతాం.

– రమణ, ఆటోడ్రైవర్, పూర్ణామార్కెట్



నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వాహనమిత్ర పథకం అమలు ఇలా..	సం.	ఆటోడ్రైవర్లు	ఇచ్చిన మొత్తం
	2019-20	883 మంది	రూ. 88,30,000
	2020-21	883 మంది	రూ. 88,30,000
	2021-22	1596 మంది	రూ. 1,59,60,000
	2022-23	1596 మంది	రూ. 1,59,60,000
	2023-24	2734 మంది	రూ. 2,73,40,000
	మొత్తం		రూ. 7,69,20,000

ఇన్సూరెన్స్‌కు ఉపయోగపడేది..



గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన వాహన మిత్ర నగదుతో ఆటో ఇన్సూరెన్స్ కట్టుకునే వాడిని. ఇన్సూరెన్స్‌కు రూ. 5,500 కట్టి మిగతా సొమ్ము ఆటో నిర్వహణకు ఉపయోగించుకునే వాడిని. ఇప్పుడు కనీసం ఆటో ఫైనాన్స్ కూడా కట్టలేకపోతున్నాను. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

– వెంకట్రావ్, ఆటో డ్రైవర్, పూర్ణామార్కెట్

క్యాన్సర్ రోగికి వాసుపల్లి ఆర్థిక సాయం



క్యాన్సర్‌తో మంచం పట్టిన జోహార్ బేగంకు ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్న మైనార్టీ మహిళకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసి దాతృత్వం చాటుకున్నారు. 36వ వార్డుకి చెందిన జోహార్ బేగం గత కొద్ది కాలంగా నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న వాసుపల్లి గణేష్‌కుమార్ ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించి, రూ.10 వేలు వైద్య ఖర్చుల కోసం అందజేశారు. క్యాన్సర్ వ్యాధిని ధైర్యంగా ఎదుర్కొని సంపూర్ణ ఆరోగ్యంతో మళ్లీ సాధారణ జీవితం గడపాలని వాసుపల్లి ఆకాంక్షించారు. కార్యక్రమంలో 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, వార్డు అధ్యక్షుడు మహ్మద్ షకీల్, పార్టీ నాయకులు పిల్లా అప్పారావు, కాకి పద్మ, కడియం ప్రసాద్, కంటుముచ్చు సాగర్, జమీల్, చెన్నా శ్రీధర్, బంగారి సత్యం, కంచుబోయిన కిషోర్, మాధవ్, స్వప్న, శత్రువు, లియాకత్, సుబ్రహ్మణ్యం, షబ్బీర్, సయ్యద్ భాను, మహ్మద్ సలీం, రఫీ, అహ్మద్, స్మిత్, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

28 నుంచి ఉద్యోగార్థులకు శిక్షణ తరగతులు

డాబాగార్డెన్స్: అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉద్యోగ శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్టు నిర్వాహకుడు డాక్టర్ బి.గంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. అటవీశాఖ ఉద్యోగాలకు, కేంద్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు తరగతులు చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ నెల 28 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గాని, 9315015015 నంబరులో గాని సంప్రదించాలన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారుడు అయ్యంకికి ఘన నివాళి



అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కుమార్‌రాజు తదితరులు

అల్లిపురం: గ్రంథాలయ ఉద్యమకారుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతి అల్లిపురం శాఖా గ్రంథాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. కుమార్‌రాజు జ్యోతి వెలిగించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అయ్యంకి గ్రంథాలయ ఉద్యమకారుడు, ఆయుర్వేద, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తులన్నారు. పత్రికా సంపాదకుడిగా గ్రంథాలయ సర్వస్వం పత్రిక నిర్వహించారన్నారు. అతను గ్రంథాలయ ఉద్యమంలో జీవితాంతం విశేష కృషి సల్పి గ్రంథాలయ పితామహుడిగా పేరుగాంచారన్నారు. భారత ప్రభుత్వం వీరు చేసిన కృషిని గుర్తించి పద్మశ్రీ బిరుదుతో సత్కరించిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.వి.ఎస్. రాజు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

డాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతిని పురస్కరించుకుని జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారి బుర్రి కుమార్ రాజు అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. గ్రంథాలయాల స్థాపనకు అయ్యంకి కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ జి.తిరుమలకుమారి, లైబ్రేరియన్ ఎల్.రాజేంద్రవర్మ, సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థినుల నూతన కమిటీ



నూతన కమిటీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 2025–26 విద్యా సంవత్సరానికి నూతన స్టూడెంట్ యూనియన్‌ను ఎంపిక చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. అధ్యక్షురాలిగా సీహెచ్ నందిని (థర్డ్ బీఎస్సీ), ఉపాధ్యక్షురాలిగా ఎస్.తులసి (సెకండ్ బీఏ), కార్యదర్శిగా బి.నవీన (సెకండ్ బీబీఏ), కల్చరల్ ఇన్‌చార్జిగా ఆశ్రిత (సెకండియర్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్), స్పోర్ట్స్ సెక్రటరీగా జ్యోతిక ఎంపికైనట్టు తెలిపారు. ఎంపికైన స్టూడెంట్ యూనియన్ బాడీని ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ యూనియన్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, కమిటీ సభ్యులు కె.గీతాంజలి, బి. రాధమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఆస్తులు అన్యాక్రాంతం కాకూడదు



జీవీఎంసీ కమిషనర్, అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మేయర్ శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. కమిషనర్ కేతన్ గార్గ్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావుతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో జోనల్ వారీగా ఎన్ని ఖాళీ స్థలాలు, పార్కులున్నాయి, వాటిలో ఆక్రమణకు గురైన స్థలాలు, అన్ని జోన్లలో కలిపి 48 కోర్టు కేసులకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ జీవీఎంసీ ఆస్తుల పరిరక్షణకు అధికారులు కృషి చేయాలన్నారు. రోడ్డు పక్కన ప్రభుత్వ స్థలం ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి భారీ జరిమానాలు వేయాలన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్లు మీనాకుమారి, ధనుంజయ్‌రెడ్డి, డీసీపీలు హరిదాసు, రామ్మోహన్, ఏసీపీలు, టీపీవోలు, ఇతర పట్టణ ప్రణాళిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నర్సెస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

డాబాగార్డెన్స్: ఏపీ గవర్నమెంట్ నర్సెస్ విశాఖ జిల్లా అసోసియేషన్ సర్వసభ్య సమావేశం గురువారం కేజీహెచ్ నర్సెస్ క్లాక్ రూమ్‌లో నిర్వహించారు. నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.రాధమ్మ, కార్యదర్శి ఎస్.కోటమ్మ పాల్గొని నర్సులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పీహెచ్‌సీల్లో నాలుగో స్టాఫ్ నర్సును పోస్ట్ చేయడం, రాత్రి విధుల్లో రక్షణ కల్పించడం, టైం బాండ్ ప్రమోషన్స్, కాంట్రాక్ట్ నర్సుల క్రమబద్ధీకరణ/సమాన పనికి సమాన వేతనం, బదిలీల అవకాశం కల్పించాలని మొర పెట్టుకున్నారు. త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని రాష్ట్ర నాయకులు తెలిపారు. విశాఖజిల్లా యూనియన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.ఇందిర ఇటీవల కాలంలో పదోన్నతి వచ్చి గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్ కావడంతో ఆ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆ పోస్టును కంటి ఆస్పత్రిలో పని చేస్తున్న హెడ్‌నర్స్ డి.రాజేశ్వరిని రాష్ట్ర నాయకుల సమక్షంలో నియమించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యులు, నర్సులు సకాలంలో సేవలందించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, ఏపీ ఎన్‌జీజీవో జిల్లా నాయకులు కె.ఈశ్వరరావు, రవిశంకర్, టి. గంగా భవానీ, జీవీఎస్ వరలక్ష్మి, వంశీ, మెహర్‌కాంతి, పద్మజ, ఎస్.జి.గౌరీ, లిల్లీగ్రేస్, వినీల, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రావణలక్ష్మి పూజలకు ఆలయాలు సిద్ధం

నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం



ఉమాదేవి, నీలమ్మ వేపచెట్టు అమ్మవార్లు

అల్లిపురం: ఆషాఢ మాసం గురువారంతో ముగిసి శుక్రవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా ఇప్పటికే అమ్మవార్ల దేవాలయాలు పూజలకు సిద్ధమవుతున్నాయి. ఈ ఏడాది 5 శుక్రవారాలు రావటం, మొదటి రోజే శుక్రవారం రావటంతో వరలక్ష్మి పూజలు చేసేందుకు మహిళలు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఇళ్లలో బూజులు దులిపి, గడపలకు పసుపులు రాసి ముగ్గులతో అందంగా అలంకరించారు. నియోజకవర్గంలో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన బురుజుపేట శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం, నీలమ్మ వేపచెట్టు అమ్మవారి ఆలయం, వెంకటేశ్వర మెట్టపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయం, అలివేలు మంగమ్మ అమ్మవారి ఆలయం, టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వేంచేసిన ఉమాదేవతకు పూజలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో మొదటి శుక్రవారం జాజులు, కనకాంబరాల మూరలతో అమ్మవారిని అలంకరించనున్నట్లు ఆలయ అర్చకుడు భార్గవశర్మ తెలిపారు.

'తెలుగు దిగ్దర్శనం' గ్రంథావిష్కరణ

సీతంపేట: భారతీయ విద్యా కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ బీవీకే కళాశాలలో డాక్టర్ తూమాటి సంజీవరావు సంపాదకత్వంలో ప్రచురించిన విశిష్ట తెలుగు దిగ్దర్శనం గ్రంథావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథి, ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య గొల్లపల్లి నాగేశ్వరరావు గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూమాటి సంజీవరావు తెలుగు భాష ప్రాచీన ప్రతిపత్తి కోసం ఒంటరి పోరాటం చేసి సాధించారని ప్రశంసించారు. సంజీవరావును ఘనంగా సన్మానించారు. సభకు అధ్యక్షత వహించిన బీవీకే కళాశాల కరస్పాండెంట్ ఆచార్య విశ్వనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు మాతృభాషపై మమకారం పెంచుకోవాలన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ తెలుగు భాష పుట్టుపూర్వోత్తరాలు, సాహిత్య వికాసం గురించి తెలిపారు. 25 మంది భాషా సాహితీవేత్తలు రచించిన వ్యాసాలను సంకలనంగా రూపొందించి తెలుగువారికి అమూల్యమైన గ్రంథాన్ని అందించారని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రత్నశేఖర్, తెలుగు అధ్యాపకులు మోహనరావు పాల్గొన్నారు.

విజువల్ పోలీసింగ్‌తో మెరుగైన భద్రత



కప్పరాడ జంక్షన్‌లో విజువల్ పోలీసింగ్ నిర్వహిస్తున్న సీఐ రవికుమార్

మద్రిపాలెం: పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చి ఆదేశాల మేరకు ప్రజలకు భద్రతతో పాటు గంజాయి, మాదకద్రవ్యాల వంటి నేరాల నియంత్రణపై గురువారం కంచరపాలెం ఐదో పట్టణ సీఐ రవికుమార్ విజువల్ పోలీసింగ్ నిర్వహించారు. కప్పరాడ జంక్షన్‌లో సిబ్బందితో కలిసి విధులు నిర్వహించారు. అక్కడి వచ్చి వెళ్లే వారితో ఆయన మాట్లాడుతూ నేరాలు, ప్రమాదాలపై తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలు సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ తరహాలోనే విజువల్ పోలీసింగ్ ద్వారా నేరాలను పూర్తిస్థాయిలో అరికట్టవచ్చని సీఐ అన్నారు. నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల కట్టడికి విజువల్ పోలీసింగ్‌ను మరింత కట్టుదిట్టంగా అమలు చేస్తామని చెప్పారు.

నమ్మించి మోసం చేయటమే బాబు నైజం



పార్టీ నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వాసుపల్లి



మాట్లాడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: ఐదు కోట్ల ఆంధ్రులను నమ్మించి మోసం చేసిన నయవంచకుడు చంద్రబాబునాయుడు అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ మండిపడ్డారు. జీవీఎంసీ 36వ వార్డులో ఆ వార్డు ఇన్‌చార్జి, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, వార్డు అధ్యక్షుడు మహ్మద్ షకీల్ ఆధ్వర్యంలో ఏవీఎన్ కళాశాల బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు మహిళలకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని మోసం చేయడం చంద్రబాబు నైజమన్నారు. ఎన్నికల ప్రచారంలో ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. మంత్రి లోకేష్ కూడా తన యువగళం పాదయాత్రలో హామీలిచ్చారన్నారు. ఇక చంద్రబాబునాయుడు అయితే పథకాల కోసం ఆంధ్రానే అమ్మాలన్న ఆలోచన చేస్తున్నారని చెప్పడం సిగ్గుచేటన్నారు. సూపర్ సిక్స్ హామీలన్నింటినీ అమలు చేసేశాం.. ఎవరైనా కాదంటే వాళ్ల నాలుక మందమని మాట్లాడడం సిగ్గు చేటన్నారు. సంక్షేమ పాలన అంటే జగన్‌మోహన్‌రెడ్డిని చూసి నేర్చుకోవాలన్నారు. పవన్ కల్యాణ్ వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామని, ఉన్న పళంగా వారిని విధుల్లోంచి తొలగించారన్నారు. ఏడాదిలో చేసిన రూ.1.86 లక్షల కోట్ల అప్పు ఏమైందని ప్రశ్నించారు. కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ జహీర్ అహ్మద్, పార్టీ నాయకుడు మక్సూద్ అహ్మద్, అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, పిల్లా అప్పారావు, కాకి పద్మ, కడియం ప్రసాద్, కంటుముచ్చు సాగర్, జమీల్, చెన్నా శ్రీధర్, బంగారి సత్యం, కంచుబోయిన కిషోర్, మాధవ్, స్వప్న, లియాకత్, సుబ్రహ్మణ్యం, షబ్బీర్, సయ్యద్ భాను తదితరులు పాల్గొన్నారు.

27న బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం



మాట్లాడుతున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: ఏడాదిన్నర కూటమి అరాచక పాలనపై 41వ వార్డు జ్ఞానాపురంలో ఈ నెల 27 ఆదివారం నిర్వహించనున్న బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ పిలుపునిచ్చారు. జ్ఞానాపురం పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం వార్డు నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల గుండె చప్పుడు, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి కార్యకర్తలు, స్థానికులు తరలి రావాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయం అన్నారు. కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.